

# మూడు కోణాలు

కథ

సలీం

## వినోద్:

'ఈ ప్రపంచంలో నీకత్యంత యిష్టమైన వ్యక్తి ఎవరంటే' మా నాన్నని చూపిస్తాను. మా నాన్న తర్వాతే అమ్మయినా, భార్యయినా. నేనచ్చం మా నాన్న పోలికల్తో పుట్టానట... నా చిన్నప్పుడు నాన్న ఎత్తుకుని మురిసిపోవటం నాకింకా గుర్తు. ప్రతి విషయంలో నాన్నని అనుకరించడానికి ప్రయత్నించేవాణ్ని. చేసేది చిన్న ఉద్యోగమైన నా కళ్ళకు మా నాన్న హీరో.

నాన్న ఎంత కష్టపడి నన్ను చెల్లిని యింతటివాళ్ళని చేశాడో తల్చుకుంటే గుండె నీరైపోతుంది. ఆబిడ్స్ కూడలిలో ఉన్న బట్టల షాపులో నాన్న గుమాస్తాగా పన్చేసేవాడు. నెలకు రెండొందల జీతం... నల్లకుంటలో ఓ చిన్న గదిలో అద్దెకుండేవాళ్ళం. రాత్రుళ్ళు బొద్దింకలు, ఎలుకలు వంటిమీద పాకుతూ ఉండేవి. వచ్చిన కొద్ది జీతంతోనే సంసారాన్ని గుట్టుగా లాక్కొచ్చారు. వాళ్ళు తినీ తినక మమ్మల్ని పెంచి పెద్దచేశారు.

నన్ను చదివించి, సాఫ్ట్‌వేర్ యింజనీర్ని చేశారు. దానికోసం అమ్మా నాన్న ఎన్నెన్ని త్యాగాలు చేశారో నాకు తెలుసు.

నాన్నకు ఏ దురలవాటూ లేదు. చివరికి వక్కపొడి కూడా తినడు. అటువంటి వ్యక్తికి లివర్ సమస్య ఉందని తెల్సిన రోజు మిన్ను విరిగి మీద పడ్డట్లు చలించిపోయాను. నాకు తెల్సినవాళ్ళలో కొంతమంది రోజూ తాగుతారు... పది నిముషాలకో సిగరెట్టు ముట్టించి... గంటకో గుట్కా బిగించి... వాళ్ళందరూ బాగానే ఉన్నారు. తన ఉద్యోగం, సంసారం తప్ప మరో వ్యాపకం పట్టని మా నాన్న రోగంతో మంచాన పడ్డాడు.

'లివర్‌నిండా కొవ్వు పేరుకుపోయి లివర్ పాడైపోయింది' అని డాక్టరన్నప్పుడు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. మా నాన్నకు మాంసాహారం యిష్టమైనా ఖర్చెక్కువవుతుందని వాటి జోలికి పోయేవాడు కాదు. కూరగాయలు కొనడానికి స్తోమత ఉండేది కాదు. పచ్చడి మెతుకులే గతి. ఎప్పుడైనా నీళ్ళచారులా పప్పొండేది అమ్మ. ఏ పండగలకో పబ్బానికో నెయ్యి వాసన చూసే భాగ్యం దొరికేది. అలాంటిది నాన్న లివర్‌లో కొవ్వు పేరుకుపోవటం ఏమిటి? వింత కాకపోతే... విధి లిఖితమేమో...

డాక్టర్లు పరీక్షలన్నీ చేశాక లివర్ పూర్తిగా చెడిపోయిందనీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ తప్ప మరో దారి లేదని తేల్చి చెప్పారు. ఆ రోజు డాక్టర్ చెప్పిన విషయాలు నాకింకా గుర్తున్నాయి. 'ప్రస్తుతం లివింగ్ డోనర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వైద్యం అందుబాటులో ఉంది. ఎవరైనా బంధువులుగానీ, బైటివాళ్ళు కానీ తమ లివర్లో కొంత భాగాన్ని దానంగా యివ్వడానికి ముందుకొస్తే ఆపరేషన్ చేసి, ఆ లివర్ని మీ నాన్నకు అమరుస్తాం. ఎనిమిది వారాల్లో అది పూర్తి పరిమాణంలోకి ఎదుగుతుంది. మీ నాన్న ఆరోగ్యం బాగుపడ్తుంది. ఎటొచ్చీ సమయం చాలా తక్కువుంది. రెణ్ణెల్ల లోపల ఆపరేషన్ జరగాలి' అన్నాడు.

అంటే రెణ్ణెల్ల లోపల జరక్కపోతే నాన్న మాకు మిగలడు. అమ్మో... నాన్న లేని జీవితాన్ని వూహించలేను. ఎట్లయినా నాన్నని బ్రతికించుకోవాలి. అందుకే చెల్లీ నేను యిద్దరం మా లివర్‌లోంచి కొంత భాగాన్ని యివ్వడానికి అంగీకారం తెలిపాం. చెల్లి బ్లడ్ గ్రూపు సరిపోలేదు. నా బ్లడ్ గ్రూపు సరిపోయిందని డాక్టర్ చెప్పినపుడు నాకెంత సంతోషం వేసిందో... నేను లివర్‌ని దానంగా యివ్వటం లేదు. నా జన్మకు కారణమైన తండ్రి రుణం తీర్చుకునే అదృష్టం ఆ భగవంతుడే కల్పించదానుకున్నాను.

కానీ వసంత... లంఖిణిలా అడ్డుపడ్తుందని వూహించలేకపోయాను. అతి సున్నితంగా, నాజూగ్గా కన్పించే శరీరంలో అంతటి క్రూరత్వం ఎక్కడనుంచి వచ్చిందో... అదే వాళ్ళ నాన్నకు అటువంటి అగత్యమే వచ్చి, తను అవయవ దానం చేస్తానంటే నేను వద్దనేవాణ్ణా... ఐనా లివర్ పూర్తిగా యివ్వాల్సిన అవసరం లేదుగా... ఓ చిన్న ముక్క. అంతే. మరలా అది మామూలు సైజుకి కొన్ని రోజుల్లో పెరుగుతుందని డాక్టర్ చెప్పాడుగా. కిడ్నీ దానం చేస్తే జీవితాంతం ఒక కిడ్నీతోనే బతకాలి. కాని దేవుడు లివర్ రూపంలో ఓ అద్భుత రూపాన్ని సృష్టించాడు. లివర్‌లోంచి కొంత భాగాన్ని తీసేసినా మరలా అది పూర్వపు సైజుకి పెరగటం లివర్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం వేచి ఉన్న వేలాది రోగుల విషయంలో దేవుడిచ్చిన వరం కదూ.

ఎంత నచ్చచెప్పినా వసంత అర్థం చేసుకోదేందుకు? మూర్ఖంగా అడ్డుకోవటం తప్ప... తనూ చదువుకుందిగా. డాక్టర్లతో తనూ వివరంగా మాట్లాడిందిగా. ఆడవాళ్ళలో దయ, కరుణ, జాలి, ప్రేమ యిత్యాది గుణాలు పుష్కలంగా ఉంటాయంటారు. వసంతను చూస్తే అది తప్పేమోననిపిస్తోంది.

'యిదంతా మీ కోసమే. ఆపరేషన్ తర్వాత మీ ఆరోగ్యం పాడైతే నేను తట్టుకోగలనా చెప్పండి. మీరంటే నాకిష్టం. ప్రేమ. అందుకే వద్దంటున్నాను' అంటుంది. వితండ వాదం... ఏమైనా అర్థం ఉందా? నా మీద ప్రేమట... కాదు స్వార్థం. నన్ను ప్రేమిస్తే, అది నిజమైన ప్రేమయితే, నా వాళ్ళను కూడా ప్రేమించాలిగా. ప్రేమంటే సవ్యంగా అర్థం చేసుకోవటం...ప్రేమంటే త్యాగం...ప్రేమంటే అనంతమైన కరుణ... సున్నితత్వం...తను రాయిలా కఠినంగా ఉందే మరి.

యిలా ప్రతి భార్యా, భర్తా అడ్డుపడిపోతే ఆత్మీయులకోసమో, తన వాళ్ళకోసమో అవయవదానాలు చేసేవాళ్ళు కరువైపోరా? అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదంటారు. నా ఉద్దేశంలో అన్ని దానాల్లోకి

అవయవ దానం గొప్పది. అది మరో వ్యక్తికి కొత్త జీవితాన్నిస్తుంది. ప్రాణాల్ని కాపాడుతుంది.

'మీ నాన్న గురించే ఆలోచిస్తారేం? మనకు పుట్టబోయే పిల్లల గురించి వాళ్ళ ఆరోగ్యాల గురించి ఆలోచించరెందుకు? మీరు ఆరోగ్యంగా ఉంటేనే కదా వాళ్ళు బావుండేది... మీకేమైనా ఐతే మా భవిష్యత్తు మాటేమిటి' అంటూ అర్థంలేని వాదన...

నేను నా లివర్లోంచి ఓ తునకని యివ్వడానికీ, నాకు పుట్టబోయే పిల్లల ఆరోగ్యానికీ ఏమిటీ సంబంధం? లివర్ దానం చేసిన వాళ్ళకు పిల్లలు పుట్టరనీ, పుట్టినా అనారోగ్యంతో పుడ్తారనీ ఏ వైద్య శాస్త్రంలోనూ చెప్పిన దాఖలాలు లేవే.

యిది తండ్రీ కొడుకుల ఆత్మీయానుబంధానికి సంబంధించిన విషయం. మధ్యలో ఈ పానకంలో పుడకలేమిటి?

ఏ ఆపరేషన్‌లోనైనా కొన్ని యిబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. కొంత రిస్క్ తప్పదు. అలాగని ఆపరేషన్లు చేయించుకోకుండా ఉంటారా ఎవరైనా? పొద్దున లేచిందగ్గర్నుంచి రోడ్డుమీదికెళ్తే రోజూ యాక్సిడెంట్లు జరుగుతూనే ఉంటాయి. అలాగని భయపడిపోయి రోడ్డుమీదికెళ్ళటమే మానుకుంటామా? నాకు వసంత ధోరణి నచ్చటం లేదు.

ఎవరేమైనా అనుకోనీ... నా నిర్ణయంలో మార్పుండదు. వచ్చే గురువారం ఆపరేషన్‌కి రెడీ చేయమని చీఫ్ సర్జన్‌తో చెప్పాను.

అంటే మరో పది రోజులు... అంతే. నాన్నకు ఈ బాధలు మరి కొన్ని రోజులే. ఆయన మరలా కొత్త ఉత్సాహంతో నా కళ్ళముందు తిరుగాడుతుంటే చూడాలనే కోరిక వువ్వెత్తున ఎగసిపడ్తూ... అప్పుడు అమ్మ కళ్ళలో కన్నీళ్ళకు బదులు ఆనంద బాష్పాలు విరబూస్తాయి. వాళ్ళకు కొడుగ్గా పుట్టినందుకు నా జన్మ ధన్యమౌతుంది.

***

## వసంత:


వినోద్ యింత మూర్ఖంగా ఆలోచిస్తాడని ఎన్నడూ అనుకోలేదు. అంత మొండి పట్టేమిటి? చెప్తే అర్థం చేసుకోడేం? సెంటిమెంట్లు వద్దనను. కానీ ప్రాక్టికల్‌గా కూడా ఆలోచించాలిగా. పర్యవసానాలెలా ఉంటాయో తెల్సుకోకుండా దూకేస్తానంటాడు. మాటా మాటా పెరిగి చేయి చేసుకున్నాడు కూడా. నేనూ యింజనీరింగ్ గ్రాడ్యుయేట్‌నే. నేనూ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పన్చేస్తున్నాను. కొడ్తే సహిస్తానా... పాతకాలం అమ్మాయిని కాదు తన్నినా పడి ఉండటానికి.

కొద్దిగా ఆలోచించాక శాంతపడ్డాను. కన్న తండ్రి కదా... ఏదో ఆవేశంలో తొందరపడి ఉంటాడని సమాధానపడ్డాను. ఎటొచ్చీ తన లివర్ని దానం చేసే విషయంలో మాత్రం రాజీ పడే ప్రసక్తే లేదు.

హాస్పిటల్‌లో సర్జన్‌తో నేనూ, నాన్న వెళ్ళి మాట్లాడి వచ్చాం. 'లివర్ని అనటామికల్‌గా ఎనిమిది భాగాలుగా విభజిస్తారు. రైట్‌లోబ్ వాల్యూమ్ అరవై శాతం, లెఫ్ట్‌లోబ్ వాల్యూమ్ నలభై శాతం ఉంటుంది. పెద్దవాళ్ళకు డొనేట్ చేయాలంటే లివర్లోంచి అరవై శాతం భాగాన్ని కోయాల్సి వస్తుంది. అదే చిన్న పిల్లల కోసమైతే నలభై శాతం భాగాన్ని తీస్తే చాలు. అరవై శాతం లివర్ని తీయాల్సి వచ్చినపుడు దానికడ్డుగా ఉన్న గాల్ బ్లాడర్‌ని కూడా తొలగించాల్సి వస్తుంది' అని డాక్టర్ చెప్పాడు.

రిస్క్ గురించి అడిగినపుడు, 'ఏ ఆపరేషన్లో ఐనా ఉండే రిస్కేనమ్మా. ఓవర్ బ్లీడింగ్ కావచ్చు. షాక్‌కి లోను కావచ్చు. ఎనస్తీషియాలో పొరపాట్లు జరగొచ్చు. పోస్ట్ ఆపరేషన్ కాంప్లికేషన్లు రావొచ్చు' అన్నాడు.

అలా కాకుండా, ప్రత్యేకంగా లివర్ డొనేట్ చేయటం వల్ల వచ్చే కాంప్లికేషన్లు చెప్పమని అడిగినపుడు, 'లివర్ యిచ్చిన వ్యక్తి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడ్తుందమ్మా. ఆర్నెల్ల నుంచి సంవత్సరం పట్టొచ్చు. విశ్రాంతి తీసుకుంటూ, డాక్టర్ల పర్యవేక్షణలో మందులు వాడాల్సి ఉంటుంది' అన్నాడు. మరీ తరిచి తరిచి అడిగితే 'ఒక్కోసారి చనిపోయే ప్రమాదం కూడా ఉందమ్మా. ఎటొచ్చీ అది అదృష్టవశాత్తు ఒక్క శాతం మాత్రమే' అన్నాడు. పేషంటుకి లివర్ అమర్చాక కూడా కొన్ని కేసుల్లో ఓ సంవత్సరానికి మించి బతక్కపోవచ్చుట. అటువంటప్పుడు వినోద్ యింత రిస్క్ తీసుకోవటం మూర్ఖత్వం కాక మరేమిటి?



అతనికి తన తండ్రి ఎంత ముఖ్యమో నాకు నా భర్త అంత ముఖ్యం కదా. నా మామగారు తన అరవైయేళ్ళ జీవితాన్ని బాగానే జీవించారు. నాకూ వినోద్‌కి ముందు ముందు చాలా జీవితముంది. పెళ్ళయి ఆర్నెల్లు కూడా కాలేదు. లివర్ యిచ్చాక సంవత్సరం వరకూ మందులు వాడుతూ విశ్రాంతి తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాలని కదా డాక్టర్ చెప్పాడు. అదే టైంలో నేను గర్భం దాలిస్తే ఎటువంటి పిల్లలు పుడ్తారో... భగవంతుండా! నా భయాల్ని ఎవ్వరూ అర్థం చేసుకోరా? ఒక్క నా తండ్రి తప్ప నాకెవ్వరూ వత్తాసు పలకటం లేదు. ఆడపిల్ల హృదయం ఒక్క కన్న తండ్రికే అర్థమౌతుందేమో...

'నా లివర్ నా యిష్టం' అన్నాడు వినోద్. ఆ మాట తప్పు కదా. పెళ్ళి కాకముందైతే అతనిష్టమే. కానీ యిపుడు నేనతని భార్యని. అతని శరీరంలోంచి ఓ అవయవాన్ని కోసి ఎవరికో యిచ్చేస్తానంటే నేనొప్పుకోవాలిగా. నా యిష్టానికి వ్యతిరేకంగా

**'నా లివర్ నా యిష్టం' అన్నాడు వినోద్. ఆ మాట తప్పు కదా. పెళ్ళి కాకముందైతే అతనిష్టమే. కానీ యిపుడు నేనతని భార్యని. అతని శరీరంలోంచి ఓ అవయవాన్ని కోసి ఎవరికో యిచ్చేస్తానంటే నేనొప్పుకోవాలిగా. నా యిష్టానికి వ్యతిరేకంగా ఎలా యిస్తాడో నేనూ చూస్తాను.**

ఎలా యిస్తాడో నేనూ చూస్తాను.

***

## కోటేశ్వర్రావు:

రెణ్ణెల్ల లోపల ఆపరేషన్ చేయకపోతే ప్రాణాల మీద ఆశ వదులుకోవాలని డాక్టర్ చెప్పాడు. నాకు బతకాలని ఉంది. నా కొడుక్కి పెళ్ళి చేసి ఆర్నెల్లు కూడ కాలేదు. వాడికి పుట్టే పిల్లల్తో హాయిగా ఆడుకోవాలని ఉంది.

నా భార్య అమాయకురాలు. నేను లేకుండా ఎలా బతుకుతుందో ఏమో... నా లివర్ పూర్తిగా చెడిపోయిందని తెలీగానే కన్నీటి సముద్రంలా మారిపోయింది.

వయసులో ఉన్న రోజుల్లో బలంగా, దృఢంగా ఉన్న నాకు, అనారోగ్యమంటే ఏమిటో తెలీని నాకు యిటువంటి రోగ మొస్తుందని ఎప్పుడూ వూహించలేదు. బీరు బ్రాందిల్లాంటివి తాగితే లివర్ చెడిపోతుం దంటారు. నా ఖర్మ ఏమిటో... కాఫీ టీలు తప్ప మరేమీ ఎరుగనే. నాకు తెలిసి ఈ జన్మలో ఏ పాపమూ చేయలేదు. మరి దేవుడెందుకు నాకీ శిక్ష వేశాడు? పూర్వ జన్మలో చేసిన పాపాలకు ఫలిత మేమో?

దాదాపు ముప్పయ్ ఐదు సంవత్సరాలు బట్టల కొట్లో గుమాస్తాగా పన్చేశాను. వినోద్‌కి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చాక బలవంతంగా నా చేత పని మాన్పించాడు. అప్పటినుంచీ విశ్రాంతి తీసుకుంటే కాలక్షేపం చేస్తుంటే ఈ ఉపద్రవం ముంచుకొచ్చింది.

నా కొడుకు తన లివర్ని దానం చేస్తానని ముందుకొచ్చినపుడు ఎంత సంతోషపడ్డానో... తండ్రిగా గర్వపడ్డాను కూడా. ముసలి తల్లి దండ్రుల్ని పట్టించుకోకుండా వాళ్ళ ఖర్మకు వాళ్ళనొదిలేసి విదేశాలకి ఎగిరిపోతున్న కొడుకులున్న ఈ రోజుల్లో వినోద్‌కి నా మీదున్న ప్రేమ, శ్రద్ధా నన్ను ఆనందంలో ముంచెత్తాయి.

ఈ గురువారం కాకుండా వచ్చే గురువారం ఆపరేషన్. మరో పది రోజులు. అంతే. అపుడు నాక్కావల్సినవి వండించుకుని తృప్తిగా తింటాను. ఈ మాయదారి రోగం వచ్చినప్పటి నుండి అన్న హితవు లేకుండా పోయింది. ఏది చూసినా కడుపులో తెముల్తోంది. ఏది తిన్నా వాంతికొస్తోంది. నెల్లోపలే ఎంతగా చిక్కి బలహీనపడ్డానో... యిలా బతకటం ఎంత దుర్భరమో... దీనికన్నా చావటమే నయం.

అమ్మో చావే... నాకు చావంటే భయం. నేను బతకాలి. బతుకు తాను. వినోద్ నాకు కొత్త బతుకునిస్తున్నాడు. కొన్నేళ్ళ క్రితం నేను వాడికి జన్మనిచ్చాను. వాడిపుడు నాకు మరో జన్మనిస్తున్నాడు.

ఆపరేషన్‌కి వసంత అడ్డు చెప్తోందని నా భార్య చెప్పింది. అందు లో నాకేమీ తప్పు కన్పించటం లేదు. నా ఆరోగ్యం బాగుండాలని నా భార్య ఎలా కోరుకుంటుందో, తన భర్త ఆరోగ్యం బాగుండాలని ఆ పిల్ల కోరుకోవటంలో తప్పేం ఉంది? నేనేమీ కసాయి తండ్రిని కాదు కదా. నా స్వార్థం కోసం నా కొడుకు ఆరోగ్యాన్ని పణంగా పెట్టేంత దుర్మార్గుడిని కాదు కదా. వినోద్ తన లివర్లోంచి కొంత నాకిచ్చినా మరలా అతని లివర్ ఎదిగి మామూలు సైజుకొస్తుందని, అప్పటి వరకూ ఆ మిగిలిన లివరే అన్ని విధుల్నీ సక్రమంగా నిర్వర్తిస్తుందని డాక్టర్ భరోసా యివ్వబట్టే కదా నేనూ ఒప్పుకున్నాను. వినోద్ మీద తనకొక్కదానికే ప్రేమున్నట్లు మాట్లాడుతుందే... అంతకన్నా ఎక్కువ ప్రేమ నాకుంది. ఈ విషయాన్ని కోడలెందుకు అర్థం చేసుకోదూ... కనీసం ఆ అమ్మాయికి అర్థమయ్యేలా ఎవరైనా నచ్చచెప్తే ఎంత బావుంటుంది...

***

## వసంత:

నాకు తెల్సిన లాయర్ని సంప్రదించాను. అవయవ దానానికి సంబంధించి మన దేశంలో ఉన్న చట్టాల గురించి వివరంగా చెప్పాడతను.

'మన దేశం 1994లో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ యాక్ట్ తెచ్చింద మ్మా. ఆ చట్టంలోనే చావుని పునర్ నిర్వచించి బ్రెయిన్ డెత్‌ని కూడా కలిపారు. సమీప బంధువులు కానివాళ్ళు తమ అవయవాల్ని దానం చేయాలంటే కోర్టులో అఫిడవిట్ వేయాలి. తాము ఎటువంటి ప్రలోభానికో, వత్తిడికో లొంగకుండా యిష్ట పూర్వకంగా, రోగిమీద తమకున్న ఆత్మీయతకొద్దీ దానం చేస్తున్నట్లు అందులో స్పష్టంగా పేర్కోవాలి. తర్వాత రాష్ట్ర కమిటీ ముందు హాజరు కావాలి. ఆ కమిటీ నుంచి అనుమతి లభించాకనే అవయవాన్ని యివ్వాల్సి ఉంటుంది. అదే దగ్గరి బంధువులైతే యివన్నీ అక్కరలేదమ్మా' అన్నాడు.

'అటువంటప్పుడు ఎవరైనా సరే తాము దగ్గరి బంధువులమని చెప్పి ముందుకు రావొచ్చుగా'.

'అలా వీలు కాదమ్మా. రోగితో తనకున్న బంధుత్వాన్ని రుజువు చేసే పత్రాలు దాఖలు చేయాలి'.

'అది సరే. నా భర్త నా అనుమతి లేకుండా తన శరీరంలోని అవ యవాల్ని ఎవరికైనా దానం చేయవచ్చా?' అని అడిగా.

'కోర్టు ఒప్పుకోదమ్మా. మన హిందూ ధర్మ ప్రకారం భార్య భర్తలో అర్ధ శరీరం. మన న్యాయశాస్త్రం ఏం చెప్తుందంటే ఏ ధర్మ ప్రకార మైనా భార్య అనుమతి, అంగీకారం లేకుండా భర్త అవయవ దానం చేయడానికి లేదు. నీకే రకమైన అభ్యంతరం లేదని నువ్వు హాస్పిటల్ వాళ్ళకు అఫిడవిట్ యిచ్చాకే ఆపరేషన్ జరుగుతుంది'.

భార్యగా నా అనుమతి లేకుండా వినోద్ అవయవ దానం చేయ డానికి వీల్లేదని లాయర్ చెప్పాక కోర్టులో కేస్ వేశాను. ఆపరేషన్ మరో రెండ్రోజులుందనగా కోర్టు నుంచి యింటెరిం స్టే ఆర్డర్ తెచ్చా ను. తదుపరి ఉత్తర్వు వెలువడే దాకా వినోద్ తన నాన్నకి లివర్ దానం చేయడానికి వీల్లేదని కోర్టు స్పష్టంగా పేర్కొంది.

వినోద్ భగ్గున మండిపడ్డాడు. విపరీతంగా నోరు పారేసుకున్నాడు. యింట్లోంచి వెళ్ళిపొమ్మని గెంటేశాడు. నాకూ అభిమానముంది. నెనెవరి మీదా ఆధారపడి వాళ్ళ దయాదాక్షిణ్యాల మీద బతకటం లేదు. నా తాపత్రయమంతా అతని ఆరోగ్యం గురించే ఐనా వినోద్ అంత రాక్షసంగా ప్రవర్తించటం నాకు నచ్చలేదు. కోర్టుకెళ్ళానని గింజుకుంటున్నారు తప్ప ఎందుకు చేశానో ఎవరికోసం చేశానో ఆలోచించరెందుకు? నా భర్త, నాకు పుట్టబోయే పిల్లలు బావుండా లని ఓ స్త్రీగా కోరుకోవటం తప్పా? ఆ డాక్టర్ చెప్పాడుగా లివర్ దానం చేసిన వాళ్ళలో ఒక శాతం మంది చనిపోతారని. ఆ ఒక్క శాతంలో వినోద్ చేరిపోతే... అమ్మో... ఆ వూహకే వళ్ళు జలదరి స్తోంది. వినోద్ ఏకపక్షంగా ఆలోచిస్తాడెందుకు? బట్టలు సర్దుకుని పుట్టింటికొచ్చేశాను. వినోద్ వచ్చి తప్పయిందని ఒప్పుకుని బతిమా లుకుంటే తప్ప మరలా ఆ గడప తొక్కదల్చుకోలేదు.

అలా వచ్చేసిన రెణ్ణెల్ల తర్వాత మా మామగారు పోయారన్న కబురందింది.

ఆ రోజు వినోద్‌తో పాటు మా మామగారి తరఫు బంధువులు మా యింటి మీదకు దాడికొచ్చారు. పెద్ద గొడవ జరిగింది.

**ఆపరేషన్ మరో రెండ్రోజుల్లో ఉందనగా కోర్టు నుంచి స్టే వచ్చింది. వసంత యింత టి దారుణానికి పాల్పడుతుందని వూహిం చలేకపోయాను. రాక్షసి... నేనేగా యిష్టపడి చేసుకున్నాను...నాకు మనుష ల్ని సరిగ్గా అంచనా వేయటం రాదు. పెళ్ళి చూపుల టైంలో ఓ అరగంట ప్రైవేట్‌గా కూడా మాట్లాడి, చాలా మంచిదన్న నిర్ణ యానికొచ్చేశాను.**



పోలీసులొచ్చారు.

నా వల్లనే మామగారు చనిపోయారట. నేను హంతకురాలినట. నాకు ఉరిశిక్ష వేయాలట.

ఆయన చనిపోయినందుకు నాకూ బాధగానే ఉంది. యిలా జరుగుతుందని వూహించలేదు. మరో డోనర్‌ని డాక్టర్లే వెతికి పెడ్తారనుకున్నాను. డబ్బు పడేస్తే దొరకని వస్తువుంటుందా మన దేశంలో? కోర్టు స్టేని వెకేట్ చేయించడం కోసం కోర్టుల చుట్టూ తిరిగి కాలహరణం చేసింది వాళ్ళు. ఆ సమయంలో మరో దాత కోసం ప్రయత్నించి ఉంటే మామగారు బతికి ఉండేవారు. లివర్ని వేరొకరి దగ్గర కొనాల్సి వస్తే ఆర్థికంగా నా వంతు సాయం కూడా చేసేదాన్ని. బ్యాంకులో నేను దాచుకున్న రెండు లక్షలు సంతోషంగా యిచ్చేసేదాన్ని.

అవయవాల కోసం ఎదురు చూస్తున్న పేషంట్లు ఎక్కువ సంఖ్యలో ఉంటారని, అమర్చడానికి అందుబాటులోకొచ్చే అవయవాలు అందులో పది శాతం కూడా ఉండవని డాక్టర్ చెప్పాడు. సంవత్సరానికి సగటున తొమ్మిది వేల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అందులో ఎన్నో బ్రెయిన్ డెత్ కేసులుంటాయి. వాటి గురించి సరైన సమాచారాన్ని తెల్సుకోవటం వల్ల ప్రయోజనం ఉంటుంది కదా. అది చేయరు. ఆస్ట్రేలియా, సింగపూర్, బెల్జియం లాంటి దేశాల్లో 'ప్రెస్యూమ్‌డ్ కలిసెంట్' అనే రూలుంది. అంటే చనిపోయిన వ్యక్తి తాను చనిపోవడానికి ముందు, తన అవయవాలు దానం చేయడానికి వీల్లేదని స్పష్టంగా తెలిపితే తప్ప, అతను అవయవ దానానికి ప్రభుత్వానికి అంగీకారం తెల్పినట్లే లెక్క. మన ప్రభుత్వం కూడా చట్టంలో యిలాంటి మార్పు తీసుకురావొచ్చుగా. అదీ లేదు.

వినోద్ పట్టుదలతో ప్రయత్నిస్తే మరో డోనార్ దొరికేవాడు. తప్పు తన వైపుంచుకుని నా మీద పడి ఏడ్వటం అన్యాయం కదా.

*ఓ రోజు నాన్నకు సీరియస్‌గా ఉందని హాస్పిటల్ నుంచి ఫోనొచ్చింది. నేను వెళ్ళేలోపలే నాన్న చనిపోయాడు. అమ్మ ఆ క్షణం నుంచీ మాటా పలుకూ లేకుండా శిలలా మారిపోయింది. నాకు దుఃఖంకన్నా కోపమే ఎక్కువగా వచ్చింది. మా నాన్న చనిపోలేదు. వసంత చంపేసింది. దారుణంగా, నిర్దాక్షిణ్యంగా చంపేసింది. దాహంతో చావబోతున్న వ్యక్తికి మంచినీళ్ళందించాల్సింది పోయి, చుక్క నీరు కూడా దొరక్కుండా అడ్డుపడటం శిక్షార్హమైన నేరం కాదా... మా నాన్నకు ఆపరేషన్ జరక్కుండా అతని చావుకి కారణమైన వసంతని శిక్షించవద్దా...*



విడాకులిస్తానని వినోద్ బెదిరించిపోయాడు. యిటువంటి మూర్ఖుడితో కాపురం చేయడంకన్నా విడాకులే మేలేమో...

***

## వినోద్:

ఆపరేషన్ మరో రెండ్రోజుల్లో ఉందనగా కోర్టు నుంచి స్టే వచ్చింది. వసంత యింతటి దారుణానికి పాల్పడుతుందని వూహించలేకపోయాను. రాక్షసి... నేనేగా యిష్టపడి చేసుకున్నాను...నాకు మనుషుల్ని సరిగ్గా అంచనా వేయటం రాదు. పెళ్ళిచూపుల టైంలో ఓ అరగంట ప్రైవేట్‌గా కూడా మాట్లాడి, చాలా మంచిదన్న నిర్ణయానికొచ్చేశాను. అందమైన మొహాల వెనక ఎంతటి వికృతమైన మనస్తత్వాలుంటాయో వసంతని చూస్తే అర్థమౌతోంది.

కోర్టు ఉత్తర్వులు విని నాన్న చాలా బాధపడ్డాడు. అమ్మ ఏడుపుని చూళ్ళేకుండా ఉన్నాను. ఎంత మంది ఉసురు పోసుకుంటుందో మహా తల్లి...

మాకు తెల్సిన లాయర్ దగ్గరకెళ్ళాను. తొందరగానే స్టేని వెకేట్ చేయిస్తానన్నాడు. ఆఫీసుకి శెలవ పెట్టి కోర్టు చుట్టూ లాయర్ల చుట్టూ తిరిగాను. ఓ రోజు నాన్నకు సీరియస్‌గా ఉందని హాస్పిటల్ నుంచి ఫోనొచ్చింది. నేను వెళ్ళేలోపలే నాన్న చనిపోయాడు.

అమ్మ ఆ క్షణం నుంచీ మాటా పలుకూ లేకుండా శిలలా మారిపోయింది. నాకు దుఃఖంకన్నా కోపమే ఎక్కువగా వచ్చింది. మా నాన్న చనిపోలేదు. వసంత చంపేసింది. దారుణంగా, నిర్దాక్షిణ్యంగా చంపేసింది. దాహంతో చావబోతున్న వ్యక్తికి మంచినీళ్ళందించాల్సింది పోయి, చుక్క నీరు కూడా దొరక్కుండా అడ్డుపడటం శిక్షార్హమైన నేరం కాదా... మా నాన్నకు ఆపరేషన్ జరక్కుండా అతని చావుకి కారణమైన వసంతని శిక్షించవద్దా... మామూలు శిక్ష కాదు. మరణశిక్ష విధించాలి.

మా లాయర్‌తో మాట్లాడాను. దానికి శిక్ష పడేవరకు నిద్రపోనని చెప్పాను కాని లా పుస్తకాల్లో అటువంటి సెక్షన్ లేదట.

అందుకే కొట్టి చంపేద్దామన్న కసితో యింటికెళ్ళాను. మా వాళ్ళు నన్ను పట్టి ఆపకుండా ఉంటే చంపేసి, పోలీసులకి లొంగిపోయి ఉండేవాణ్ని.

కోర్టులు శిక్షించకున్నా పైన దేవుడున్నాడు. తప్పకుండా వసంతని శిక్షిస్తాడు. అప్పటిగ్గాని మా నాన్న ఆత్మ శాంతించదు.

***

## కోటేశ్వరరావు

(చనిపోవడానికి కొన్ని గంటల ముందు)

నా కోడలు కోర్టుకెళ్ళి స్టే తెచ్చిందని తెల్సినపుడు బాగా కుంగిపోయాను. నాకిప్పుడు బతకాలని లేదు. నాకత్యంత ప్రియమైన వినోద్ జీవితంలో నా వల్ల కలతలు రావటం మనసుని మరింత కలచివేస్తోంది. నేను పోయినా పర్లేదు. నా కొడుకూ కోడలు బావుండాలి. చక్కగా సంసారం చేసుకుంటూ పిల్లాపాపల్ని కని బతుకుని పండించుకోవాలి. నాది పండిపోయిన బతుకు. రాలిపోవటం వల్ల నష్టం లేదు.

ఎటొచ్చీ ఉదాత్తమైన అవయవ దానానికి యిన్ని అడ్డంకులు ఉండటమే బాధనిపిస్తోంది. నాలా ప్రపంచంనిండా ఎన్ని వేల మంది అవయవ దాతలు కళ్ళల్లో ప్రాణాలు నిల్పుకొని ఎదురు చూస్తున్నారో... ఈ కోర్టులు అడ్డుపుల్లలేయటం ఎంతవరకు సమంజసం? కుటుంబంలోని వ్యక్తుల అంగీకారం అవసరమని నిర్ణయించటం ఎంతవరకు సబబు? మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి తనలోని ఓ భాగాన్ని దానం చేయడానికి మరొకరి అనుమతితో ఏం అవసరం?

నాకిప్పుడు ఒకే ఒక కోరిక మిగిలింది. నా వల్ల విడిపోయిన కొడుకూ కోడలు ఒకటి కావాలి. వాళ్ళు సంతోషంగా ఉండాలి. సుఖంగా ఉండాలి. నాకు మాట పెగలటం లేదు. భార్యని పిలిచి చివరి వీడ్కోలు తీసుకోవాలని ఉంది. నేను చనిపోబోతున్నానని తెలుస్తో ఉంది. నా కొడుకు దగ్గరగా ఉంటే నా కోడల్ని క్షమించమని చెప్పి చనిపోవాలని ఉంది. ఎలాగూ ఆ భగవంతుడి దగ్గర కెళ్తున్నాగా... అతన్ని వేడుకుంటాను. నా కోడల్ని క్షమించమని.

●